క్లుప్తంగా

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



యూనియన్ బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో అధికారులు

హుజూర్‌నగర్ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఆరెడ్డి హనుమంతరెడ్డి, డిప్యూటీ హెడ్ తేజావతి సర్వేశ్ అన్నారు. గురువారం హుజూనగర్‌లో యూబీఐ నూతన రెండో బ్రాంచ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాతాదారులకు వివిధ రకాల రుణాలు, సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భద్రాద్రి అశోక్, సీనియర్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, యూనియన్ సెక్రటరీ నారాయణనాయక్, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మునగాల: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునగాల ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సోషల్ మీడియా, రెంటల్, ఇన్‌వెస్ట్‌మెంట్ లోన్స్, బెట్టింగ్ యాప్, కస్టమర్ కేర్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడితే సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్ నంబర్ 1930 నీ సంప్రదించాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

మోతె : ఆర్థిక అక్షరాస్యతపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని ఆర్బీఐ అధికారి గోమతి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉర్లుగొండ గ్రామంలో తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు, ఖాతాదారులకు నిర్వహించిన అవగాహణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇన్సూరెన్స్, క్రాప్ లోన్, మహిళా సంఘాల నిర్వహణ, ఏటీఎం కార్డుల నిర్వహణ, రికరింగు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐసీ అధికారి జగదీష్, ఉర్లుగొండ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వీరాకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ రవి, సిబ్బంది, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలను నివారించాలి

మునగాల : ప్రైవేటు ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలను, భ్రూణ హత్యలను నివారించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి కంటికి రెప్పలా కాపాడుకోవాలని అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను కోరారు. స్కానింగ్ సెంటర్లు, ఆపరేషన్ థియేటర్లలో సీసీ పుటేజీ పర్యవేక్షణలో పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించేలా చూడాలన్నారు. సమాజంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా కాసులకు కక్కుర్తి పడి వైద్యాధికారులు ఆసుపత్రుల డాక్టర్లపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మానవ హక్కుల కమిషన్‌కు నివేదిక సమర్పిస్తామని, అవసరమైతే బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

చెరువు ఆక్రమణలపై చర్యలేవీ?



దిర్శించర్లలోని ఊర చెరువు



ఊర చెరువు శిఖం భూమిలో మట్టి పోసి చదును చేసిన రైతులు (ఫైల్)

కబ్జా కోరల్లో ఊర చెరువు

- చెరువును కాపాడాలని హైకోర్టులో మత్స్య సొసైటీ ఛైర్మన్ కేసు
- కోర్టు ఆదేశాలతో సర్వే
- 50 ఎకరాలకు పైగా ఆక్రమణలు గుర్తించి హద్దులు ఏర్పాటు
- చెరువు శిఖం భూమిని స్వాధీనం చేసుకోవడంలో జాప్యం

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల ఊర చెరువు కబ్జాకు గురైంది. సర్వే నంబర్ 52లో 111.28 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉండగా చుట్టుపక్కల భూములు గల 22 మంది రైతులు దర్జాగా చెరువు శిఖం భూమిని పూడ్చి 50 ఎకరాలకు పైగా ఆక్రమించారు. కొందరు రైతులు చెరువు ఆక్రమించి అక్రమ పట్టాలు సంపాదించి రైతుబంధు కూడా పొందుతున్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువు పూడికతీతకు మిషన్ కాకతీయ పథకం కింద దాదాపు రూ.33 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ సమయంలో కాంట్రాక్టర్ పూడికతీసిన మట్టినే కొందరు రైతులు చెరువు శిఖం భూమిలో పోసి చదును చేసుకుని ఆక్రమణకు పాల్పడ్డారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని పలువరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే కాంట్రాక్టర్ కూడా ఆక్రమించిన చెరువు భూమి జోలికి వెళ్లకుండా మిగత చోట పూడికతీత పనులు చేపట్టారు. చెరువు విస్తీర్ణం ఉన్నంత వరకు పూడిక తీసినట్లయితే చెరువు భూమి ఆక్రమణకు గురికాకుండా ఉండేదని పలువురు రైతులు చెబుతున్నారు. అయితే చెరువు ఆక్రమణపై ఆ సమయంలో మత్స్య సొసైటీ చైర్మన్ నాగరాజు.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కానీ వారు పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 11వ తేదీన హై కోర్టులో కేసు వేశాడు. దీంతో హైకోర్టు.. చెరువు ఆక్రమణపై విచారణ జరిపి ఫిబ్రవరి 22వరకు వరకు నివేదిక అందించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌ను ఆదేశించింది. దీంతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా చెరువు భూమిని సర్వే చేసి 50 ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్లు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. చెరువును ఆక్రమించిన రైతులకు నోటీసులు కూడా జారీ చేశారు. కానీ నేటివరకు కబ్జాకు గురైన చెరువు భూమిని అధికారులు స్వాధీనం చేసుకోలేదు. చెరువు ఆక్రమణతో చెరువు విస్తీర్ణం తగ్గి చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని చెరువు కింద సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు విస్తీర్ణం తగ్గడంతో చేపల దిగుబడి లేక జీవనాధారం కోల్పోతున్నామని మత్స్య సొసైటీ సభ్యులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణ గురైన చెరువును సర్వే ప్రకారం నిర్ణయించిన హద్దుల మేరకు స్వాధీనం చేసుకోవాలని రైతులు, మత్స్య సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

హై కోర్టును ఆశ్రయించా



“దిర్శించర్లలోని ఊర చెరువును కబ్జా నుంచి కాపాడేందుకు హై కోర్టును ఆశ్రయించా. అధికారులు కోర్టు ఆదేశాల మేరకు చెరువును సర్వే చేసి ఆక్రమణలను గుర్తించారు. కానీ ఆక్రమణదారుల నుంచి చెరువు భూమిని స్వాధీనం చేసుకోలేదు. అధికారులు వెంటనే స్పందించి సర్వే చేసి నిర్ణయించిన హద్దుల మేరకు 50 ఎకరాల చెరువు భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలి.

– పంగ నాగరాజు, మత్స్య సొసైటీ ఛైర్మన్, దిర్శించర్ల ఊర చెరువు

కోర్టు ఉత్తర్వులు రాగానే స్వాధీనం చేసుకుంటాం



“దిర్శించర్ల ఊర చెరువును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేశాం. చెరువును ఆక్రమించుకున్న రైతులకు నోటీసులను కూడా జారీ చేశాం. చెరువు ఆక్రమణల కేసు కోర్టులో ఉన్నందున కోర్టు ఆదేశాలు రాగానే కబ్జాకు గురైన దిర్శించర్ల చెరువు భూమిని స్వాధీనం చేసుకుంటాం.

– సురిగి సైదులు, తహసీల్దార్, నేరేడుచర్ల

వ్యవసాయ మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి



మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

- మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యుల విజ్ఞప్తి

హుజూర్‌నగర్ : వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పాలక మండలి చైర్‌పర్సన్ రాధికా అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, పాలకవర్గ సభ్యులు.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో వారిని విజ్ఞప్తి చేశారు. మఠంపల్లి మండలంలో కోల్డ్ స్టోరేజీ, పశువుల సంత ఏర్పాటు చేయాలని, ఇతర మండలాలకు కావాలిసిన గోదాంల నిర్మాణాల గురించి మంత్రులకు వివరించారు. దీంతో మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. తొలుత మంత్రులను శాలువ, గజమాలతో ఘనంగా సన్మానించి మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, పలువురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి రాములుకు నాయకుల పరామర్శ

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ములకలపల్లి రాములు సతీమణి కుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం కొక్కిరేణిలో రాములును పలువురు సీపీఎం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుమారి మృతి బాధాకరమని, రాములు రాజకీయ జీవితం వెనుక కుమారి కృషి ఎంతగానో ఉందని కొనియాడారు. రాములును పరామర్శించిన వారిలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సయ్యద్ హాషీం, నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నాయకులు సైదులు, వెంకన్న, బ్రహ్మం, శంభయ్య, ములకపల్లి నాగరాజు, సైదులు ఉన్నారు.

చేతిరాతపై అవగాహన

సూర్యాపేట : పరీక్షల్లో, ఉద్యోగాల్లో రాణించేందుకు మంచి చేతి రాత కూడా ముఖ్యమని ప్రముఖ కార్టునిస్టు పల్లె మణిబాబు అన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బాలభవన్ ఉచిత వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు చేతిరాతపై గురువారం మెళకువలు నేర్పించారు. పల్లె మణి బాబుకు బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధకృష్ణ కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

పీఏసీఎస్‌లో అవినీతిపై రెండవరోజు విచారణ



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న విచారణాధికారి ఇందిర

మునగాల : మండలంలోని తాడువాయి ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై రెండవ రోజు గురువారం విచారణాధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.ఇందిర సొసైటీ కార్యాలయంలో బహిరంగ విచారణ జరిపారు. పలువురు రైతులు తీసుకున్న రుణాలు చెల్లించి రశీదులు పొందినప్పటికీ సొసైటీ ఖాతాలో జమచేయకుండా సిబ్బంది స్వాహా చేసినట్లు గతంలో జరిగిన విచారణలో తేలడంతో సీఈఓ, ఎస్ఏ, కంప్యూటర్ ఆపరేటర్‌లను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. కాగా సొసైటీలో రుణాలు తీసుకొని చెల్లించిన రైతులు బహిరంగ విచారణకు హాజరుకావాలని విచారణాధికారి నాలుగు రోజుల క్రితం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో కోరారు. విచారణలో భాగంగా గురువారం సొసైటీ పరిధిలోని తాడువాయి గ్రామానికి చెందిన శెట్టి గిరి, చిర్ర నాగయ్య, కోట మంగమ్మ, వీరమళ్ల ఉపేందర్, మాధవరం గ్రామానికి చెందిన యలమంచలి గుర్వమ్మ, వీరబోయిన గుర్వయ్య, వీరబోయిన వెంకన్న, వీరబోయిన గురవయ్యలు ఆధారాలతో విచారణ అధికారి ముందు హాజరయ్యారు. తాము సొసైటీలో రుణం చెల్లించినప్పటికీ సొసైటీలో సిబ్బంది జమ చేయలేదని విచారణాధికారి ముందు తెలిపారు. కాగా శుక్రవారం సొసైటీ పరిధిలోని నేలమర్రి, రేపాల గ్రామాలకు చెందిన రైతులు విచారణలో పాల్గొనాల్సి ఉందని విచారణాధికారి ఇందిర తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఇన్‌చార్జ్ సీఈఓ చందా ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరంపై అసత్య ప్రచారం తగదు



హుజూర్‌నగర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

హుజూర్‌నగర్ : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారం చేయడం తగదని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎంత ఖర్చయింది, అసలు కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఏంటనేది మంత్రులకు పూర్తిగా తెలియదని ఎద్దేవా చేశారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రులు అవగాహన లేకుండా మాట్లాడడం సరైంది కాదని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ అని అయన ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అటకెక్కించి అనవసరమైన రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తు న్నారని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, నాయకులు బెల్లంకొండ అమర్, కేఎల్ఎన్‌రెడ్డి, రాము, చంటి, నర్సింహారావు, రహీమ, ఉష, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

పట్టణంలో ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందిన నర్సింగ్ ధనమూర్తి కుటుంబసభ్యులను ఒంటెద్దు నర్సింహారెడ్డి గురువారం పరామర్శించారు. ధనమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కారు ప్రమాదానికి గురై గాయాలపాలైన జడ అంజిని పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

రామాలయంలో నరసింహారెడ్డి పూజలు

మఠంపల్లి : మండలంలోని హనుమంతులగూడెంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో స్వామివారిని గురువారం ఒంటెద్దు నరసింహారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు బారెడ్డి సీతారామిరెడ్డి, రజితారెడ్డి, కోలాహలం కృష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, మాజీ ఉపసర్పంచ్ బారెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, సైదిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, మట్టారెడ్డి, వీరారెడ్డి, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన అమరబోయిన వెంకటప్పయ్య (65) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం. దీంతో గురువారం కోదాడకు చెందిన పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి మృతుని కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి చేయూతనందించారు. ముకుందాపురం మాజీ సర్పంచ్ పందిరి కళావతి, పందిరి ఫౌండేషన్ సలహాదారు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



నేరేడుచర్ల : ర్యాలీ నిర్వహిస్తున్న హింధూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు



గరిడేపల్లి : మంగాపురంతండాలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హుజూర్‌నగర్: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు



గరిడేపల్లిలో మామిడి పండ్లతో హనుమంతుడికి అభిషేకం

కోదాడ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ఆలయాలకు తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. శ్రీరంగాపురం అభయాంజనేయస్వామి ఆలయం, సూర్యాపేట రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, అనంతగిరి రోడ్డులోని రంగనిగుడిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

హనుమంతుడికి మామిడి పండ్లతో అభిషేకం

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి తోమాల సేవతో పాటు సహస్ర మామిడి పండ్లతో అభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పఠించారు. యువకులు, హనుమాన్ భక్తులు ర్యాలీ నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, ఆలయ కమిటీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. గడ్డిపల్లి, కల్మలచెరువు, గారకుంటతండా తదితర గ్రామాల్లో గల ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, గెల్లి సతీష్‌కుమార్, మారుతినగర్ యూత్ సభ్యులు, గ్రామపెద్దలు, పూజారులు సుదర్శన శ్రీనివాసచార్యులు, రాజన్‌ఆచార్యులు, సీతారాం ఆచార్యులు మహిళలు పాల్గొన్నారు.

మంగాపురం తండాలో స్వామివారి కల్యాణం

మండలంలోని మంగాపురం తండాలో శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి కల్యాణ మహోత్సవాన్ని పూజారులు రాయపోలు శ్రీరామశర్మ, భద్ర శర్మలు మంత్రోత్సవాల నడుమ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో బైక్ ర్యాలీ

నేరేడుచర్ల : పట్టణం, మండలంలో హనుమాన్ జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీకోదండ రామాలయం, శివాలయం, పాత నేరేడుచర్లలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. స్వామివార్లకు అర్చకులు అభిషేకాలు, ఆకు పూజలు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు పాత నేరేడుచర్ల నుంచి పట్టణ ప్రధాన విధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కోదండ రామాలయంలో సంగీత విద్వాంసులచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. సోమప్ప దేవాలయం సమీపంలోని పురాతన భక్తాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.

నామవరంలో పూజలు

మోతె : హనుమాన్ జయంతి సందర్భంగా మోతె మండలంలోని నామవరం గ్రామంలో గల శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ వెంకటకృష్ణయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో..

మేళ్లచెరువు : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, వడమాల, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

గోవిందపురంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురంలో గల శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుపూజ నిర్వహించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు రంగభట్టాచార్యులు, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌రెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, పిచ్చయ్య, వీరబాబు, ఫణికుమారి, భక్తులు పాల్గొన్నారు.

మఠంపల్లి మండలంలో..

మఠంపల్లి : మండల వ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామంచికుంటతండాలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ సునీతాలాలునాయక్, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. భీల్యానాయక్ తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోతు కోటానాయక్ రూ.35 వేల విలువ గల మైక్ సెట్‌ను ఆలయానికి బహూకరించారు. మఠంపల్లిలోని అభయాంజనేయ స్వామి ఆలయం, రఘునాథపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో పూజలు, అన్నదానం చేశారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : మండల వ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

మునగాల మండలంలో..

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంసాని కృష్ణమూర్తి అఖండ దీపారాధనను, నల్లపాటి శ్రీనివాస్ హనుమాన్ చాలీసా పారాయణాన్ని ప్రారంభించారు. అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు వీరస్వామి, అంజయ్య, సభ్యులు మీసేవ శర్మ, వేట సైదారావు, గ్రామ పెద్దలు శ్రీనివాస్, ఎల్‌వీ.ప్రసాద్, వెంకటప్పయ్య, దుర్గాప్రసాద్, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : మండల వ్యాప్తంగా గురువారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిలుకూరులోని అభయాంజనేయస్వామి, వీరాంజనేయస్వామి, సంతాన ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు బేతవోలు, నారాయణపురం హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్, ఈవో మృత్యుంజయ శాస్త్రి, ఆలయ కమిటీ చైర్మన్లు, సభ్యులు, పూజారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మునగాల : హనుమాన్ ధ్వజం ఎగురవేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



చిలుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్ఐ రాంబాబుగౌడ్



కోదాడలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



నడిగూడెం : సిరిపురంలో



మేళ్లచెరువు : పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



మోతె : అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యుత్ డీఈ, తదితరులు

ఆనవాళ్లు కోల్పోతున్న కాలువలు

- ఆక్రమణకు గురైన మేజర్, మైనర్ కాల్వలు
- గడ్డి, కంపచెట్లతో అధ్వానం
- పూడిక తీయాలని రైతుల వేడుకోలు



గడ్డితో నిండి ఉన్న మేళ్లచెరువు- రేవూరు మేజర్ కాలువ

మేళ్లచెరువు : మండలంలోని సాగర్ ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న ఎన్నెస్పీ కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మేజర్, మైనర్ కాలువలు గడ్డి, కంపచెట్లతో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మైనర్ కాలువలను ఇరుపక్కలా ఆక్రమించడంతో వెడల్పు తగ్గి చివరి భూములకు సరిగా నీరందని పరిస్థితి నెలకొంది. కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా ఎన్నెస్పీ అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కందిబండ మేజర్ కాలువ కందిబండ గ్రామ శివారులో ఆక్రమణకు గురైంది. రామాపురం మేజర్ కాలువ కప్పలకుంటతండా పరిధిలో ఆనవాళ్లు లేకుండా పోయింది. రేవూరు మేజర్ కాలువ రేవూరు వద్ద పూడిపోయి కంపచెట్లు, గడ్డితో నిండిపోయింది. గుండ్లపల్లి మేజర్ కాలువ మేళ్లచెరువు రెవెన్యూ పరిధిలో ఆనవాళ్లు లేకుండా పోయిందని, ఓ సిమెంటు పరిశ్రమ వారికి రోడ్డుగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి కాల్వల్లో పూడిక తీసి కంపచెట్లు, ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ మాచవరం గ్రామాల్లో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారి శాంతి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో మాన్యసూక్తాభిషేకం, నాగవల్లీ దళాలతో సహస్రనామార్చన నిర్వహించారు. ఈవో వెంకట చలపతి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, తన్నీరు మల్లీకార్జునరావు, మాజీ సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, అర్చకులు నర్సింహాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, అన్వేష్‌కుమార్‌చార్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : గోపాలపురంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు